క్లుప్తంగా

రాజయ్యకు మదర్ థెరిస్సా పీస్‌ఫుల్ అవార్డ్


అవార్డు గ్రహీత రాజయ్య

యర్రగొండపాలెం: వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్యకు మదర్ థెరిస్సా పీస్‌ఫుల్ అవార్డ్ వరించింది. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సహారా చారిటబుల్ ట్రస్ట్ ఆయనకు ఆన్‌లైన్‌లో అవార్డు పత్రం అందజేశారు. రెండు దశాబ్దాలుగా దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందజేసిన ఆ ట్రస్ట్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ ఆఖలాక్ అహ్మద్‌కు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మోడల్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు శనివారం తెలిపారు. జాబ్‌మేళాలో ప్రీమియర్ సోలార్, డి మార్ట్ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆసక్తి ఉన్న 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసి 19 నుంచి 30 ఏళ్ల నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనవచ్చని చెప్పారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 95539 45387, 63022 20609, 70131 82284 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి


మాట్లాడుతున్న అట్లూరి రామారావు

దర్శి: మండలంలోని తూర్పు వీరాయపాలెం ప్రీ హైస్కూల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభ పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ ఆంజనేయులు అధ్యక్షతన శనివారం జరిగింది. విద్యార్థులతో కలిసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రామారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం భారత దేశాన్ని పాలించిన ప్రధానుల్లో మంచి ఆర్థిక వేత్త, రాజకీయవేత్త మన్మోహన్‌సింగ్ అన్నారు. ఆర్థికంగా ఒడిదొడుకులుగా ఉన్న భారత దేశాన్ని గాడిలో పెట్టారని కొనియాడారు. ఉపాధ్యాయులు నాగార్జున, విక్రం, ఎం.అశ్విని, ఎం.శ్రీనివాసరావు, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

వరి పంటపై నష్టం అంచనా


తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ మధుబాబు

కురిచేడు: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన వరి పంటను వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్, వ్యవసాయాధికారి పి.మధుబాబుతో కలిసి శనివారం పంటనష్టం అంచనా వేశారు. మండలంలోని పడమరవీరాయపాలెం, కల్లూరు, ఆవులమంద రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వారు పంటను పరిశీలించి నష్టం అంచనాలు తయారు చేశారు. 913 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని, 2,222 ఎకరాల్లో ఓదెలు నష్టం అంచనా వేసినట్లు పేర్కొన్నారు. వర్షానికి దెబ్బతిన్న వరి పంటలో ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి, పెరుగుదల దశలో వరి పైరు నీటి ముంపుకి గురైతే పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని సూచించారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని సూచించారు. పాముపొడ తెగులు ఉధృతి ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉందని వారు తెలిపారు. తెగులు వరిలో దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి పాముపొడ మచ్చలుగా మారుతాయన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు ఎండిపోతాయన్నారు. దీని నివారణకు ప్రొపికొనజోల్ 2 మిలీ లీటరు నీటికి కలిపి దుబ్బుకి తగిలేలా 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అగ్గి తెగులు ఉధృతికి ఈ వాతావరణం అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా కాసుగా మైసిన్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. సుడిదోమ కూడా ఆశించే అవకాశం ఉందని, దాని నివారణకు ఇతోఫెన్ప్రాక్స్ 2 మి.లీ లేదా బుప్రోఫోజిన్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు

దొనకొండ: మండలంలోని తెల్లబాడు పంచాయతీ పరిధి వెస్ట్ కంభంపాడులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. పెండింగ్, రెవెన్యూ సమస్యలు సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు. తమ సిబ్బందితో అర్జీలు పరిశీలించి అర్హులైన వారికి ఆన్‌లైన్, ఈ పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కేవీ నాగార్జునరెడ్డి, వీఆర్ఓ బొర్రయ్య, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో నిండా మునిగిన రైతులు


ధాన్యంపై కప్పిన పరదాలు


తడిసిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెడుతున్న రైతులు

- పడిపోయిన వరి పంట
- కల్లాల్లోనే పండించిన ధాన్యం
- పంటకు రాక మునుపే కోతలు

తాళ్లూరు:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులకు దిగులు పుట్టుకుంది. చేతికి అంది వచ్చే పంట నేలపాలవుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. వర్షాల కారణంగా పంట కోతకు రాక మునుపే యంత్రాల సాయంతో కోస్తున్నారు. కోసిన పంటను కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. వర్షాల కారణంగా ఇప్పటికే పంటలకు తెగుళ్లు ఆశించాయి. మరో పక్కా ఇటీవల కురుస్తున్న వానలకు తోటల్లో నీరు నిలబడి పంటలు దెబ్బతింటున్నాయి. మండలంలో రబీ సీజన్‌లో వరి, 1500 హెక్టార్లలో పొగాకు, 115 హెక్టార్లలో మొక్కజొన్న, 32 హెక్టార్లలో మిరప, 41 హెక్టార్లలో చెరుకు సాగు చేశారు. వరి, కంది, మిరప, చెరుకు తదితర పంటలకు ఇప్పటికే తెగుళ్ల సోకి రైతులు నష్టపోతున్నారు. పలు రకాల పురుగులతో పిందె, పూత రాలిపోతోంది. ఈ ఏడాది అకాల వర్షం కారణంగా పంటనష్ట అధికంగా ఉంది. పెట్టిన పెట్టుబడులు వస్తాయో రావోనని రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

పంటకు రాక మునుపే వరి కోయించా:



వాన ముసురును దృష్టిలో ఉంచుకుని వరి కోత మిషన్‌తో ముందే కోయించా. చేతికి వచ్చిన పంట కవర్లతో కప్పాం. అయినా వర్షానికి సగం ధాన్యం తడిసిపోయింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

టి.సుబ్బారావు, రైతు, దోసకాయలపాడు

గుచ్చే పొగాకుకు బూజు పట్టింది:



నేను రెండు ఎకరాల్లో గుచ్చే పొగాకు సాగు చేశా. ఆకు గుచ్చి షెడ్డుల్లో ఆరబెట్టా. ఈ వాతావరణంతో ఆకుకు బూజుపట్టింది. సరైన ధర పలికే అవకాశం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా రాదు.

డి.అంజిరెడ్డి, రైతు, రెడ్డినగర్

తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలు


త్రిపురాంతకంలో నేలకొరిగిన వరిచేలు


గణపవరం వద్ద కల్లాల్లో తడిసిన మిర్చిని గ్రేడ్ చేస్తున్న కూలీలు

- రైతుల ఆందోళన
- నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి

త్రిపురాంతకం: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో తుఫాన్ కారణంగా వీచిన గాలులు, వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. అదే విధంగా కోసిన వరి ఓదెలు వరి చేలల్లోనే ఉండిపోయాయి. కల్లాల్లోని ధాన్యం, మొక్కజొన్న, మిర్చి పూర్తిగా తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం తడిచి దెబ్బతినడంతో మిరప కాయలు బూజుపట్టి తాలుకాయ ఏర్పడి రంగుమారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్ కారణంగా నష్టపోయామని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయాధికారి కె.నీరజ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఆమె తెలిపారు.


వెల్లంపల్లి వద్ద దెబ్బతిన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న వాకా జనార్దన్‌రెడ్డి

దర్శి: 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జోనల్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు, కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జులై 2023 నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అమలు ఆలస్యమైతే ఐఆర్ ప్రకటించాలని కోరారు. లేవీ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు ప్రకటించాలని జెడ్పీపీఎఫ్ లోన్‌లు, క్లోజర్, ఏపీజీఎల్ఐ లోన్‌లు, క్లోజర్స్, ఎస్ఎల్ అరియర్స్ చెల్లించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, 117జీఓను రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని, ఉన్నత పాఠశాలల్లో రెండు మాధ్యమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ సభ్యులు ఎస్‌కే మస్తాన్‌వలి మాట్లాడుతూ నాడు–నేడులో భాగంగా అసంపూర్తిగా మిగిలిన భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రంగస్వామి, కోటేశ్వరరావు, తిప్పసెట్టి శ్రీనివాసులు, ఎలీషా, ఖాజా, రహంతుల్లా, ఎవీఎల్ సుబ్బారావు, ఎస్.శ్రీనివాసులు, నాగరాజు, జి.వేణు, చక్రధర్, సందు వెంకటేశ్వర్లు, వేమా రమణయ్య, అమరా శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు, వి.రాఘవరావు, ఎంవీ కృష్ణ, పీవీ నారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

దర్శి: నియోజకవర్గ కేంద్రం దర్శిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో ప్రైవేటు వ్యాపారులు రైతులను దగా చేస్తున్నారని చెప్పారు. ఎకరానికి ప్రతి రైతు రూ.11 వేలకుపైగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ధాన్యం గ్రేడ్ వన్ రకం 75 కేజీల బస్తా రూ.1740, సాధారణ రకం రూ.1725 మద్దతు ధరగా ప్రకటించిందన్నారు. ఒక పక్క కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడం, మరోపక్క వరుస తుఫాన్‌ల కారణంగా రైతులు కల్లంలోనే 75 కేజీలు బస్తాను రూ.1400లకే అమ్ముకుంటూ బస్తాకు రూ.340 నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు నష్టపోకుండా అన్నీ చోట్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పుటు చేసి రైతులకు మద్దతు ధర 12 గంటల్లోనే డబ్బులు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇది ఎక్కడా అమలు కావడం లేదని మండిపడ్డారు. దర్శి ప్రాంత రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని చెప్పారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతులతో ఆందోళన, పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రబీలో ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి


పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: రబీలో సాగు చేసిన పంటలను రైతులు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండల పరిధిలో బద్వీడుచెర్లోపల్లిలో రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను కచ్చితంగా నమోదు చేసుకోవాలని, తమ పట్టాదారుని పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, కౌలు రైతులు వీటితో పాటు కౌలు కార్డు తీసుకుని పంట పొలంలో ఫొటో దిగి ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా అందే పథకాలు వర్తిస్తాయని చెప్పారు. ప్రధాని మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. బీమా పథకం ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏ లాలరవి, రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తాళ్లూరు: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ టి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హజర్ కావడంపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా ఇలాగే వెళ్తున్నారా? అని నిలదీశారు. అధికారులు పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. బాధ్యత లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళతారని ప్రశ్నించారు. ప్రతి పథకం ప్రజలకు చేరువ చేయాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారుల పనితీరుపై పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. మండలంలో రెవెన్యూ సమయంలో అధికంగా ఉన్నాయని, పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని, ఈ పరిస్థితుల్లో తహసీల్దార్ సంజీవరావు సర్వసభ్య సమావేశానికి రాకపోవడంపై వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మండలంలో కల్తీపాలను అరికట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు అపహరణకు గురవుతున్నాయని, ప్రత్యేక దృష్టి సారించి, అరికట్టాలని బెల్లంకొండవారిపాలెం సర్పంచ్ పోశం సుమలత శ్రీకాంత్ సభ దృష్టికి తీసుకొచ్చారు. టీడీ ఇమ్మానియేలురాజు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బూచేపల్లి సేవలు మరువలేనివి

దర్శి: బూచేపల్లి సేవలు మరువలేనివని కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కిరణ్ కుమారి అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిరణ్‌కుమారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో బూచేపల్లి కుటుంబం పది విద్యార్థులకు మెటీరియల్ అందజేసిందన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు పాఠశాల తరఫున ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఆల్ ఇన్ వన్‌లు ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఉపాధ్యాయులు వాకా జనార్దన్‌రెడ్డి, కృష్ణారావు, తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, రెడ్డి నాయక్, కోటేశ్వరరావు, రంగయ్య, మాలకొండయ్య, నజీర్‌బాషా, జీనత్‌బేగం పాల్గొన్నారు.


ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌తో కొత్తపల్లి విద్యార్థులు


గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాగునీరు అందించడం అదృష్టం

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

కురిచేడు: తన తల్లిదండ్రుల పేరున ఉన్న చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రామస్తులకు తాగునీరు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేకనకొండలో బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన తన తల్లి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం బూచేపల్లి కుటుంబానికి ఆ దేవుడిచ్చిన వరమన్నారు. నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నామని చెప్పారు. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని చెప్పగానే ట్రస్టు నుంచి మూడు లక్షల రూపాయలు విడుదల చేసి ప్లాంట్ ఏర్పాటు యుద్ధప్రాతిపదికన చేయించామన్నారు. ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. మీ వెంటే తామంతా అని చెప్పకనే చెప్పినట్లు గ్రామంలోకి వారు వచ్చిన దగ్గర నుంచి తిరిగి వెళ్లే వరకూ జేజేలు పలుకుతూ పూలవర్షం కురిపించారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఎంపీటీసీ సోమవరపు అంకారావు, మండల పార్టీ కన్వీనర్ వైవీ సుబ్బయ్య, సొసైటీ మాజీ ప్రెసిడెంట్లు ఆరె శ్రీను, గోగులమూడి లింగారెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, నాయకులు కటకం రంగయ్య, శ్రీను, తాటిమట్ల పెద్దన్న, పోసా శ్రీను, టి.కృష్ణ, అన్నెం రామచంద్రారెడ్డి, మార్తల రమణారెడ్డి, పడిగెపాటి నారాయణరెడ్డి, పడిగెపాటి చంటి, సోమవరపు ఏసుదాసు, యర్రగుంట్ల లింగయ్య, మరియబాబు, బాలేసు, మరియదాసు, యర్రగుంట్ల రోశయ్య, సోమవరపు జక్రయ్య, బుడ్డ ఏసు, ఏసుపాదం, సిద్ధి వెంకటరెడ్డి, బయ్యవరం సర్పంచ్ నాగేశ్వరరావు, కిలారి వెంకటేశ్వర్లు, అంకె కృష్ణ, కొల్లా భాస్కర్, మేరువ సుబ్బారెడ్డి, వీరగంథం కోటయ్య, నుసుం ప్రతాపరెడ్డి, పానుగంటి కోటేశ్వరరావు, మార్లెళ్ల రామాంజి, చెన్నంశెట్టి గురవయ్య పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం అభినందనీయం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు: ఒక సంస్థను ఏర్పాటు చేసి పేద ప్రజలకు సాయం చేయడం అభినందనీయమని యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని శతకోడులో బందెల లూథర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా పేదలకు చీరలు, యువలకు టీషర్ట్‌లు, గడియారాలు, బ్యాగులు, డైరీలు, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మున్ముందు అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చైర్మన్ లింగయ్య, నరసింహారావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, కోటిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, నాయకులు గడ్డం సుబ్బయ్య, నాసర్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీపీ ఉష


మాట్లాడుతున్న ఎంపీపీ ఉష

దొనకొండ: అధికారులు విధి నిర్వహణలో గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉష తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. మీ దగ్గరికి ఎవరైనా సమస్య తీసుకొస్తే వీలైనంత వరకు సమస్యను పరిష్కరించి పంపించాలని ఆదేశించారు. మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ నేటికీ అసంపూర్ణంగా ఉన్న తరగతి గదులు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. నిధులు మంజూరైతే ఈ అకాడమిక్ ఇయర్‌లోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పశువైద్యాధికారి దేవారెడ్డినాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం గేదెలకు గొంతు వాపు వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని, తమ సిబ్బందితో గ్రామాలు తిరిగి వ్యాక్సిన్ వేయిస్తామన్నారు. వద్దిపాడుకు 2 డీప్ బోర్లు రూ.4 లక్షలు, గుమ్మా కొండయ్య ఇంటి వద్ద వాటర్ ప్లాంట్ రూ.4 లక్షలు, కలివెలపల్లి 1 డీప్‌బోర్‌కు రూ.2 లక్షలు ఎన్నికల ముందు జిల్లా పరిషత్ గ్రాంట్ రూ.10 లక్షలు మంజూరైంది. ఎన్నికల సమయంలో అధికారులు అనుమతులు ఇవ్వకుండా కాలయాపన చేశారు. ఎన్నిసార్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అనుమతులు మంజూరు చేయండి.. పనులు చేస్తాం.. అని చెప్పినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మాట దాటేస్తున్నారని వైఎస్సార్ సీపీ మద్దతుదారు సర్పంచ్ నూనె సరోజిని ఆరోపించారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వద్దిపాడు, కలివెలపల్లిలో నీటికి ఇబ్బంది లేదని, ఇబ్బంది ఉన్న సంగాపురం గ్రామంలో డీప్‌బోర్ సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. ఎంపీడీఓ ఎం.శ్రీదేవి, జెడ్పీటీసీ ఎం.సుధాకర్, పలు శాఖలకు చెందిన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.